ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలు మరువలేనివి
- ఘనంగా మాజీ ప్రధాని శత జయంతి ఉత్సవాలు
8
టీబీ రహిత సమాజం కోసం కృషి
వకీల్‌పల్లె గనికి రోలింగ్ షీల్డ్

న్యూస్ బాక్స్

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న డీపీవో

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగపేట, గంగారం, కాల్వశ్రీరాంపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల డేటా ఎంట్రీ సర్వేను డీపీవో వీరబుచ్చయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల పూర్తివివరాలను సేకరించి డాటా ఎంట్రీ చేయాలన్నారు. గ్రామాల్లో 100 శాతం ఇంటిపన్ను వసూలు చేయాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఎంపీవో కిరణ్, పంచాయతీకార్యదర్శులు శిరీష, షాహోద్దీన్, సత్యనారాయణరెడ్డి, యాసిన్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

అంతర్గాం (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా అంతర్గాం మండలం ముర్మూర్‌లో జరుగుతున్న సర్వేను తహసీల్దార్ తూము రవీందర్ పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎస్ కమల, పీతాంబర్ పాల్గొన్నారు.

తెరపైకి గుంజపడుగు మండలం

- 15 పంచాయతీలతో కలిపి ఏర్పాటు
- 12 కొత్తపంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మంథని మండలంలోని గుంజపడుగును మండల కేంద్రంగా చేయాలనే ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. అలాగే మరో 12 కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటుకు కూడా సంబంధిత శాఖాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచనల మేరకు రెవెన్యూ, పంచాయతీ, సర్వే అండ్ ల్యాండ్ శాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎప్పటి నుంచో ప్రతిపాదనలో ఉన్న సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి మండల ఏర్పాటు ఊసెత్తడం లేదు. మంథని మండలంలో గల గుంజపడుగు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా పెద్దపల్లి జిల్లాను 14 మండలాలతో ఏర్పాటు చేశారు. ఉమ్మడి రామగుండం మండలాన్ని రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాలుగా విభజించారు. అలాగే కమాన్‌పూర్ మండలాన్ని కమాన్‌పూర్, రామగిరి మండలాలుగా విభజించారు. పాలకుర్తి మండలాన్ని 13 పంచాయతీలతో కలిపి ఏర్పాటు చేశారు. ఇందులో కమాన్‌పూర్ మండలానికి చెందిన కన్నాల, రాణాపూర్ పంచాయతీలను, వెల్గటూర్ మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండేడ గ్రామాలను కలుపుకుని మండలాన్ని ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడ్డ రామగిరి మండలంలో ముత్తారం మండలంలోని బుధవారంపేట్, ఆదివారంపేట్, లద్నాపూర్, రాజాపూర్ గ్రామాలను విలీనం చేశారు. కొత్త జిల్లాలను ఏర్పాటు చేసే సమయంలోనే సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిని గర్రెపల్లి, గొల్లపల్లి, నారాయణరావుపల్లి, సాంబయ్యపల్లి, ఐతరాజుపల్లి, దుబ్బపల్లి, భూపతిపూర్, నర్సయ్యపల్లి, బొంతకుంటపల్లె గ్రామ పంచాయతీలతో పాటు ఎలిగేడు మండలం బుర్హాన్‌మియాపేట గ్రామాలను కలిపి మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ వచ్చింది. అలాగే మంథని మండలంలోని గుంజపడుగు, ఉప్పట్ల, పోతారం, విలోచవరం, మల్లెపల్లి, నాగారం, కన్నాల, రచ్చపల్లి, ఆడ్యాల, అక్కెపల్లి, సిద్ధపల్లి, సిరిపురం, దుబ్బపల్లి, చిప్పపల్లి, బెస్తపల్లి, రామగిరి మండలంలోని చందనాపూర్, సింగిరెడ్డిపల్లి, పెద్దంపేట్, సుందిళ్ల, ముస్త్యాల గ్రామాలను కలిపి గుంజపడుగు మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ మంథని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైన నాటి నుంచి ఉన్నది. గత ప్రభుత్వ హయాంలో గుంజపడుగులో ప్రజలు దశల వారీగా ఉద్యమించారు. గర్రెపల్లిని మండలంగా ఏర్పాటు చేయాలని రిలే నిరాహార దీక్షలు కూడా చేశారు. కానీ మండలాలు ఏర్పాటు కాలేదు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తప్పకుండా గుంజపడుగును మండలంగా చేస్తానని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు గుంజపడుగును మండలంగా ఏర్పాటు చేసేందుకు అడుగులు ముందుకు పడుతున్నాయి.

● గర్రెపల్లి మండలం ఊసెత్తని అధికారులు..

జిల్లాలు ఏర్పాటైన నాటి నుంచే గర్రెపల్లిని మండలంగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, అధికారులు దాని ఊసెత్తడం లేదు. గర్రెపల్లి గ్రామం రాజీవ్ రహదారిని ఆనుకుని ఉంటుంది. ఈ గ్రామంలో సర్వేనంబర్లు 1603, 1614, 1643, 1645లలో సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇక్కడ ఇప్పటికే సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాలతో పాటు ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల దవాఖాన, జిల్లాలోనే అతి పెద్ద చెరువు, దీని పరిసరాల్లో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల, ఎంబీఏ, తదితర కళాశాలలున్నాయి. అలాగే విద్యుత్ సబ్‌స్టేషన్, అన్ని రకాల వసతులున్నాయి. కానీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం కావడం లేదు. ఈ విషయమై పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు స్పందించి గుంజపడుగుతో పాటు గర్రెపల్లిని కూడా మండలంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని గర్రెపల్లి ప్రాంత వాసులు కోరుతున్నారు.

● 15 గ్రామాలతో గుంజపడుగు మండలం..

గుంజపడుగు మండలాన్ని మంథని మండలంలోని 12 గ్రామాలతో పాటు రామగిరి మండలంలో గల మూడు గ్రామాలు మొత్తం 15 గ్రామాలతో మండలంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గుంజపడుగు, అక్కెపల్లి, రచ్చపల్లి, కన్నాల, నాగారం, చిల్లపల్లి, దుబ్బపల్లి, బెస్తపల్లి, సిరిపురం, ఉప్పట్ల, పోతారం, విలోచవరం, రామగిరి మండలంలోని జల్లారం, చందనాపూర్, పెద్దంపేట గ్రామాలను కలుపుకుని గుంజపడుగు మండలాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గుంజపడుగుకు చుట్టు పక్కల ఉన్న గ్రామాలనే తీసుకున్నారు. మంథని ఆర్డీవో దీనికి సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు ఇప్పటికే పంపించారు. ఒక మండలంలో కనీసం తొమ్మిది రెవెన్యూ గ్రామాలు

మిగతా 8వ పేజీలో...

పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పన్నుల వసూళ్లను వేగవంతం చేస్తాం
- జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

'గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు ప్రకటించినా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.. జిల్లాలో మరో 12 కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.. సెగ్రిగేషన్ షెడ్లను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నాం.. పన్నుల వసూళ్లను వేగవంతం చేస్తాం..' అని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'కి ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు..

ఆంధ్రజ్యోతి: జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేశారా?

డీపీవో: ఇటీవల కొత్తగా ఏర్పాటైన జిల్లెల్లపల్లి, తోట గోపయ్యపల్లి పంచాయతీలతో కలుపుకుని 269 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉన్నాం. ఓటర్ల జాబితాలు పూర్తి చేయడంతో పాటు గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను కూడా గుర్తించాం. పోలింగ్ బాక్సులకు మరమ్మతులు చేయించి రంగులు వేయిస్తున్నాం. ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ వెలువడినా ఎన్నికలు నిర్వహించేందుకు అంతా సిద్ధంగా ఉన్నాం.

ఆంధ్రజ్యోతి: కుందనపల్లి, లింగాపూర్, వెంకట్రావుపల్లి పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తారా?

డీపీవో: 2019లో కుందనపల్లి, లింగాపూర్, వెంకట్రావుపల్లి గ్రామాలతో పాటు ఎల్కలపల్లిలోని రెండు వార్డులను రామగుండం కార్పొరేషన్‌లో విలీనం చేయడం వల్ల ఎన్నికలు నిర్వహించ లేదు. ఎన్నికలు జరిగిన తర్వాత కార్పొరేషన్ నుంచి తప్పించారు. మధ్యలో వాటికి ఎన్నికలు నిర్వహించేందుకు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగాయి. రిజర్వేషన్ల సవరణ జరిగినందున ఆ పంచాయతీలతో కొత్తగా ఏర్పడ్డ ఎల్కలపల్లి గేట్ పంచాయతీకి కూడా ఎన్నికలు నిర్వహిస్తాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఇంకా కొత్తగా ఏమైనా పంచాయతీలు ఏర్పాటవుతున్నాయా?

డీపీఓ: ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జిల్లాలో మరో 12 కొత్త పంచాయతీలు మంథని మండలం శాస్త్రులపల్లి, స్వర్ణపల్లి, ముత్తారం మండలం కాసర్లపల్లి, రంగయ్యపల్లె, సర్వారం, కాజీపల్లి, శుక్రవారంపేట, రామగిరి మండలం వకీల్‌పల్లి, గడ్డంపల్లి, కమాన్‌పూర్ మండలం కిష్టంపల్లి, ముల్కలపల్లి, అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని లబాడి తండాను పంచాయతీలుగా చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సెగ్రిగేషన్ షెడ్లను ఎందుకు సద్వినియోగం చేయడం లేదు?

డీపీవో: జిల్లాలో 265 గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాం. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి, ఇతర చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రతీ రోజు గ్రామాల్లో ఇంటింటికి ట్రాక్టర్ వెళ్లాలని ఆదేశించాం. వర్మీ కంపోస్టు తయారు చేసే విధంగా, గ్రామాలను విజిబుల్ క్లీనింగ్‌లా తయారు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: సెగ్రిగేషన్ షెడ్లను బాగా సద్వినియోగం చేసుకుంటున్న గ్రామాలు ఏవీ?

డీపీవో: సెగ్రిగేషన్ షెడ్లను 15 గ్రామాల్లో అద్భుతంగా వినియోగించుకుంటున్నారు. జూలపల్లి మండలం చీమలపేట, తేలుకుంట, కుమ్మరికుంట, అంతర్గాం మండలం పెద్దంపేట్, పొట్యాల, ఓదెల మండలం అబ్బిడిపల్లి, గోపరపల్లి, హరిపురం, లంబాడితండా, ఉప్పరపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి, సుల్తానాబాద్ మండలం అల్లీపూర్, ఐతరాజుపల్లి, బొంతకుంటపల్లి, సుద్దాల గ్రామపంచాయతీలు బాగా సద్వినియోగం చేసుకుంటున్నాయి. మిగతా పంచాయతీల్లో కూడా చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులు వస్తున్నాయా?

డీపీవో: ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే 15వ ఆర్థిక సంఘం నిధులు 4 కోట్ల 32 లక్షల రూపాయల వరకు వచ్చాయి. ఇవి పంచాయతీల నిర్వహణకే సరిపోతున్నాయి. ఎస్ఎఫ్‌సీ నుంచి దాదాపు ఐదు కోట్ల రూపాయల వరకు రాగా, పెండింగులో ఉన్న కొన్ని బిల్లులను చెల్లించాం.

ఆంధ్రజ్యోతి: పన్నుల వసూళ్లలో వెనుకబడినట్లు ఉన్నారు?

డీపీవో: ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల డిమాండ్ 7 కోట్ల 25 లక్షల 27 వేల 526 రూపాయలు కాగా, ఇప్పటి వరకు 48 శాతం అంటే 3 కోట్ల 50 లక్షల 95 రూపాయలు వసూలు చేశాం. మధ్యలో పార్లమెంట్ ఎన్నికలు జరిగిన కారణంగా వసూళ్లలో కాస్త వెనుకబడ్డాం. వచ్చే మార్చి నెలాఖరులోగా వంద శాతం బకాయిలు లేకుండా ఇంటి, నల్లా పన్నులు, ఇతరత్రా పన్నులను వసూలు చేస్తాం.

శాంతి, ప్రేమతో ప్రశాంత జీవనం

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మంథనిలో కేక్ తినిపిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



సుల్తానాబాద్‌లో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



గోదావరిఖనిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వక్కాన్‌సింగ్

మంథని, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలైన శాంతి, ప్రేమ మార్గాలను మానవాళి పాటిస్తూ ప్రశాంతంగా జీవనం సాగించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. బుధవారం మంథనిలోని బేతేలు గాసెంల్, సీయోను చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏసుప్రభువు దీవెనలతో, క్రైస్తవుల సహకారంతో తాను ప్రజాసంక్షేమం, మంథని ప్రాంత అభివృద్ధితో ముందుకు సాగుతున్నానన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తోందని, క్రైస్తవుల ప్రార్థన స్థలాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సేవకుడిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. చర్చిల అభివృద్ధి కోసం నిధులు మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం క్రిస్మస్ వేడుకలలో భాగంగా మంత్రి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ-సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు శశిభూషణ్ కాచే, ఐలి ప్రసాద్, ఐఎంఏ జనరల్ సెక్రెటరీ అంకరి కుమార్, పాస్టర్లు, సంఘం పెద్దలు, మహిళలు, క్రిస్టియన్లు పాల్గొన్నారు.

● క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం

సుల్తానాబాద్: యేసు క్రీస్తు బోధనలు విశ్వమానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో గల చర్చిల్లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు శాంతి, సహనం, కరుణ ప్రతీ ఒక్కరూ కలిగి ఉండాలని బోధించిన ఏసుక్రీస్తు మాటలు అందరూ అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, పాస్టర్స్ పాల్గొన్నారు.

● కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ: క్రిస్మస్ సంబరాలు గోదావరిఖనిలో అంబరాన్నంటాయి. తెల్లవారు జాము నుంచే అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గాంధీనగర్ సెయింట్‌పాల్ చర్చిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే గౌతమినగర్‌లోని గ్లోరియస్ చర్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద పండుగ క్రిస్మస్ అని అన్నారు. రామగుండం ప్రజలను యేసు ప్రభువు చల్లాగా చూడాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉదయ్‌రాజ్, వడ్డేపల్లి దాస్, దయానంద్‌గాంధీ, తిప్పారపు శ్రీనివాస్, పెండ్యాల మహేష్, దాసరి విజయ్, అల్లి శంకర్ పాల్గొన్నారు. జీఎం కాలనీలోని ఎప్తా చర్చిలో పాస్టర్ తిమోతి పాల్, విఠల్‌నగర్‌లోని బీడీఎస్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు పాస్టర్ డిలైట్‌రెడ్డి కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. వేడుకల్లో జీవన్‌రెడ్డి, అభిజిత్, దీపక్, భీష్మ, ఎస్బిబా, శ్రీనివాస్, జాన్, సుమన్ పాల్గొన్నారు.

● ప్రేమతో అన్ని జయించవచ్చు

ధర్మారం: శత్రువును సైతం ప్రేమతో జయించవచ్చని, అందుకు నిదర్శనం యేసు క్రీస్తేనని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ధర్మారం, పత్తిపాక చర్చిల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలతో కలసి కేక్ కట్ చేసిన అడ్లూరి, అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అడ్లూరి మాట్లాడుతూ యేసు క్రీస్తు ప్రేమ, శాంతితో లోకాన్ని జయించాడని ఆయన మార్గాన్ని అనుసరిస్తే శత్రువును సైతం ప్రేమతో జయించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మహిళకు చీరలు, చిన్నపిల్లలకు బహుమతులను అందజేశారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా అడ్లూరి మండలంలోని 25 చర్చీలకు కేకులు పంపిణీ చేశారు. వేడుకల్లో పాస్టర్ నెల్సన్, ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ తదితరలు పాల్గొన్నారు.



ధర్మారంలో చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



గోదావరిఖనిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

పొత్కపల్లి ఎస్ఐగా రమేష్



ఓదెల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి ఎస్ఐగా దీకొండ రమేష్‌ను నియమిస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌హెచ్‌వో అశోక్‌రెడ్డిని రామగుండం కమిషనరేట్‌లో వీఆర్‌లో ఉంచారు. దీంతో కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రమేష్ పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయగా బుధవారం బాధ్యతలను చేపట్టారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు మల్లయ్య మహర్షి



కమాన్‌పూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన రచయిత మల్లయ్య మహర్షి ఈ నెల 28,29వ తేదీల్లో ఏపీలోని విజయవాడలో జరిగే ఆరో ప్రపంచ తెలుగు మహాసభల కవి సమ్మేళనంలో జరిగే మహాసభలకు హాజరుకానున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు మల్లయ్య మహర్షికి ఆహ్వానం అందటంపై మండల ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కళాకారునికి సన్మానం



రాజేందర్‌ను సన్మానిస్తున్న అతిథులు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామానికి చెందిన కళాకారుడు, జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్‌కు హైదరాబాద్ రవీంద్రభారతిలో బుధవారం రాష్ట్ర సాంస్కృతిక సారథి విభాగం అధ్యక్షురాలు వెన్నెల ఘనంగా సన్మానించారు. కళాకారులను ప్రోత్సహించడంతోపాటు జానపద కళలు ప్రదర్శించి గ్రామీణ కళలను కాపాడుతున్న సందర్భంగా రాజేందర్‌ను సన్మానించినట్లు వెన్నెల తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు కేవీ రమణాచారి, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ పలువురు కళాకారులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను దశల వారీగా అమలు చేస్తున్నాం

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలను దశల వారీగా అమలు చేస్తున్నామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. అంతర్గాం మండలంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చెక్కుల పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది మంది కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ లబ్ధిదారుకు రూ.9.1 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలకుర్తి మండలం సంబంధించి రెండోసారి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆరు గ్యారంటీలను దశల వారీగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీలో రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం, రూ.500లకు గ్యాస్ సిలిండర్, సన్న ధాన్యం క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ నాయకులు రైతు రుణమాఫీ జరగలేదని, రైతుబంధు ఇవ్వలేదని అక్కడక్కడ ధర్నాలు చేశారన్నారు. ధర్నాలు చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలని, పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు రైతు రుణమాఫీ చేస్తామని మోసం చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే 70శాతం పైగా రైతులకు రుణమాఫీ చేశామని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై క్వింటాల్‌కు 10 నుంచి 20 కిలోల వడ్ల కటింగ్ చేసిన బీఆర్ఎస్ నాయకులు ఏ ముఖం పెట్టుకొని రైతుల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చి, మోసం చేసి, పారిపోయే పార్టీ కాదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేస్తామని, రైతు భరోసాను అందిస్తామని, స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అంటేనే అబద్ధాల పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు అంతర్గాం తహసీల్దార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

జగిత్యాల క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువులో దూకి బుధవారం ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముంబైకి చెందిన షేక్ ఇక్బాల్(58) ఉపాధి కోసం కామారెడ్డి జిల్లా కేంద్రానికి ఏడాదిన్నర క్రితం వలస వచ్చాడు. కుటుంబ సభ్యులతో అద్దె ఇంట్లో ఉంటున్న ఇక్బాల్ బిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ కలహాలతో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చి జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి అదృశ్యం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన అంబటి లక్ష్మి(60) అనే వృద్ధురాలు మంగళవారం నుంచి అదృశ్యమైందని ఆమె భర్త అంబటి రాజయ్య బుధవారం కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 10 రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఆమె కొడుకుతో తాను ఇంటిలో ఇక ఉండనని చెబుతూ బయటకు వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. లక్ష్మి కోసం బంధువుల ఇళ్లలో వెదికినా ఆచూకీ కనిపించలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం


గణేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి గణేష్ (25) అనే యువకుడు మంగళవారం రాత్రి నుంచి అదృశ్యమయ్యాడని ఆయన తల్లి కనుకమ్మ బుధవారం కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గణేష్ మంగళవారం రాత్రి బయటకు వెళ్తున్నానని చెప్పి ఇంటిలో నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. గణేష్ సెల్‌ఫోన్ స్విచాఫ్‌గా వస్తుందని తెలిపారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెదికినా ఆచూకీ కనిపించలేదని గణేష్ తల్లి పోలీసులకు తెలిపారు. ఈ మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

వాహనం అదుపుతప్పి దివ్యాంగుడి మృతి

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ శివారులో త్రిచక్ర వాహనం అదుపుతప్పిన సంఘటనలో మండలంలోని బండలింగంపల్లికి చెందిన దివ్యాంగుడు మహ్మద్ షాహిద్ (26) మృతి చెందాడని ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. మండలంలోని బండలింగంపల్లికి చెందిన దివ్యాంగుడు షాహిద్ స్థానికంగా మాంసం విక్రయిస్తూ జీవిస్తుండేవాడు. ఈ నెల 24న తన త్రిచక్ర వాహనంపై ఎల్లారెడ్డిపేటకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్ర గాయాలపాలైన షాహిద్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు.చికిత్స పొందుతూ షాహిద్ చనిపోయాడు. షాహిద్ సోదరి ఆసియా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వేములవాడ ఆలయ పరిసరాల్లో

మాంసాహార ప్యాకెట్ల పంపిణీ

వేములవాడ కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం పరిసరాల్లో యాచకులకు, నిరాశ్రయులకు మాంసాహారంతో కూడిన ఆహార ప్యాకెట్ల పంపిణీపై బీజేపీ నాయకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పుట్టినరోజుతో పాటు క్రిస్మస్ సందర్భంగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మాంసాహారంతో కూడిన ప్యాకెట్లను పంపిణీ చేశారు. దీనిపై బీజేపీ, హిందూ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్లాపూర్, డిసెంబరు, 25 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డట్లు స్థానికులు తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా మండల కేంద్రానికి చెందిన రామ నర్సయ్య(38) అను వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. వేములవాడ నితిన్ అను యువకుడు గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపల్లెలో పురుగులమందు తాగి చికిత్స పొందుతూ జిల్లాల ఆగయ్య(50)అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జిల్లాల ఆగయ్య చిన్న కుమారుడు మంచిర్యాలలో సెంట్రింగ్ షాప్ ఏర్పాటు చేశాడు. దీనికోసం కొంత అప్పు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తీవ్ర మనస్తాపం చెంది ఆగయ్య మంగళవారం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు ఆగయ్య భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ప్రయాణికుల బ్యాగులు తారుమారు

● ఒక బ్యాగులో ఆభరణాలు
● బాధితురాలికి అప్పగించిన పోలీసులు


ఆటో డ్రైవర్ హైమద్‌ఖాన్‌ను అభినందిస్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బస్సులోని ఓ ప్రయాణికురాలి బ్యాగ్ తారుమారు కావడంతో పోలీసులు గుర్తించి కరీంనగర్‌లో బాధితురాలికి బుధవారం అప్పగించారు. కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం కలికోట మౌనిక అనే మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం ఆదిలాబాద్ నుంచి శంకరపట్నంకు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకున్న సమయంలో మౌనిక బ్యాగ్ కనిపించలేదు. ఆ స్థానంలో మరో బ్యాగ్ కనిపించటంతో బ్యాగ్ తారుమారు అయినట్లుగా గుర్తించి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ బిల్ల కోటేశ్వర్ ఆధ్వర్యంలో క్రైం పార్టీ, బ్లూకోల్ట్స్ పోలీసులు బస్టాండ్‌లోని సీసీ కెమెరాల ఆధారంగా మరొక మహిళ ఆ బ్యాగ్‌ను తీసుకుని ఆటోలో వెళ్లినట్టుగా గుర్తించారు. వెంటనే ఆటో డ్రైవర్ హైమద్‌ఖాన్‌ను గుర్తించి అతడి సహాయంతో పొరపాటున బ్యాగ్‌ను తీసుకువెళ్ళిన మహిళ ఇంటికి వెళ్ళి బ్యాగ్‌ను భద్రంగా మౌనికకు అప్పగించారు. 4 గ్రాముల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలతో కూడిన బ్యాగ్‌ను అప్పగించామని సీఐ తెలిపారు. ఆభరణాల బ్యాగ్‌ను పట్టుకోవటంలో కృషి చేసిన క్రైంపార్టీ కానిస్టేబుల్ కుమార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది అశోక్, ఆటో డ్రైవర్ హైమద్‌ఖాన్, ఆటో యూనియన్ అధ్యక్షుడు వాజీద్‌ఖాన్, అహ్మద్‌లను సీఐ ఈ సందర్భంగా అభినందించారు.

టీ తాగండి.. కప్పు తినండి..

● అన్నారంలో ఎడిబుల్ టీ కప్స్ తయారీ
● ఎనిమిది జిల్లాలకు సరఫరా



"జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో కొద్ది నెలల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మానకొండూర్ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం సభ్యులు వెళ్లారు. అక్కడ వారికి ఎడిబుల్ కప్స్‌లో టీ పోశారు. టీ తాగిన తర్వాత ఆ కప్పులను తినవచ్చని తెలుసుకుని ఆశ్చర్యపోయారు. ఇటువంటి కప్పులను మనమెందుకు తయారు చేయవద్దని అనుకుని వివరాలు తెలుసుకున్నారు. మూడు నెలల క్రితం అన్నారం గ్రామంలో ఎడిబుల్ కప్స్ తయారీ పరిశ్రమను ప్రారంభించారు. పక్కాగా మార్కెటింగ్ చేయడంతో మంచి డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం ఎనిమిది జిల్లాలకు ఈ కప్పులను సరఫరా చేస్తున్నారు."


తయారు అయిన గ్లాసులు ఇవే

అన్నారంలో తయారు చేస్తున్న టీ కప్పులు

మానకొండూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అన్నారం గ్రామంలో ఎడిబుల్ టీ కప్స్ తయారీ కేంద్రాన్ని స్థాపించారు. జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఓ సమావేశానికి సంఘం అధ్యక్షుడు పాఖాల పురుషోత్తంరెడ్డి, డైరెక్టర్లు హాజరయ్యారు. అక్కడ ఎడిబుల్ కప్పులో టీ పోశారు. ఇవేవో బాగున్నాయనిపించి ఎక్కడ నుంచి తెప్పిస్తున్నారని అడిగారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి ఈ టీ కప్పులను సరఫరా చేసుకుంటున్నామని తెలుసుని వెయ్యి కప్పులకు ఆర్డర్ పెట్టారు. జిల్లాలోని ఆసుపత్రులు, బ్యాంకులు, సామాజిక వ్యక్తులు, పెద్ద,పెద్ద హోటళ్ల నిర్వాహకులను కలిసి వాటిని చూపించారు. మంచి స్పందన రావడంతో సహకార సంఘం ఆధ్వర్యంలో అన్నారంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సంఘంలోని మూలధనం 3.75 లక్షల రూపాయలతో మిషన్‌ను, లక్ష రూపాయలతో తయారీ సామగ్రిని కొనుగోలు చేశారు. మూడు నెలల క్రితం ఎడిబుల్ టీ కప్పుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఒక్క గ్లాసుకు 3.5 రూపాయలు ఖర్చవుతుండగా నాలుగు రూపాయలకు అమ్ముతున్నారు. కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సంగారెడ్డి, మహబూబ్‌నగర్,


గతంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కప్పుల స్టాల్స్

పెద్దపల్లి జిల్లాల్లో హోటల్‌లో ఆర్డర్‌పై ఈ కప్పులను సరఫరా చేస్తుంటారు. ఇది రాష్ట్రంలోనే మొదటి ఎడిబుల్ కప్పుల తయారీ కేంద్రం.

● చిరు ధాన్యాలతో తయారు

ఎడిబుల్ కప్పులను చిరు ధాన్యాలు అయిన రాగులు , మొక్కజొన్న పిండి, బియ్యంపిండి, మైదపిండిలో తగినంత చక్కెరను కలిపి తయారు చేస్తుంటారు. రోజుకు వెయ్యి గ్లాసులను తయారు చేసేందుకు 40 కిలోల పిండి అవసరముంటుంది. 10 గ్లాసులను ఒక్క ప్యాకెట్‌గా తయారు చేసి 40 రూపాయలకు విక్రయిస్తుంటారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉంటే రోజుకు వెయ్యి గ్లాసులకు తయారు చేస్తారు. తయారు చేసిన గ్లాసులను ప్యాకింగ్ చేసి ఆర్డర్‌పై సరఫరా చేస్తారు. ప్రస్తుతం ఒక్క గ్లాసుకు 50 పైసల లాభం వస్తోంది. మార్కెట్ పుంజుకుంటే అప్పుడు ధరను నిర్ణయిస్తాం. గతంలో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో వ్యవసాయ యూనివర్సిటీలో స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తే మంచి స్పందన వచ్చింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతో సమావేశం కాగా ఆయన సహకారం సంఘ పాలకవర్గాన్ని అభినందించి ప్రోత్సహించారు. ఈ నెల 29 నుంచి జనవరి 12 వరకు హైదరాబాద్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ఎడిబుల్ టీ కప్పుల స్టాల్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● ఆరోగ్యానికి.. పర్యావరణానికి మేలు

ఈ కప్పులో టీ తాగడమే కాకుండా కప్పును తినవచ్చు. తినక పాడేసినా అది తొందరగా భూమిలో కలిసిపోతుంది. పేపర్ గ్లాసులో టీ త్రాగడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. మిషన్‌లో పిండిని నింపేటప్పుడు దాని మీద పడ్డ పిండి గ్లాసు తయారు అయిన తర్వాత వేస్టు రూపంలో కిందపడుతుంది. దాన్ని ఆవులు, గేదలకు వేస్తే ఎంతో ఇష్టంగా తింటున్నాయి.

మూడు నెలల్లో మార్కెట్ పుంజుకుంది..



అన్నారం గ్రామంలో రైతు సహకారం సంఘం ఆధ్వర్యంలో మూడు నెలల క్రితం టీ కప్పు తయారీ కేంద్రాన్ని నెలకొల్పాం. త్వరగానే మార్కెట్ పుంజుకుంది. ప్రస్తుతం ఎనిమిది జిల్లాలకు సరఫరా చేస్తున్నాం. ఇందులో టీ తాగడం ఆరోగ్యానికి మంచిది, వాతావరణ కాలుష్యం ఉండదు. త్వరలో మొక్కజొన్న పిండి గమ్‌తో ఇస్తారాకుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం సంఘం ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాన్ని నిర్వహిస్తున్నాం.

- పాఖాల పురుషోత్తంరెడ్డి,
రైతు సహకార సంఘం అధ్యక్షుడు

బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

● గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరు
● ఏడాది దాటినా ముందుకు సాగని పనులు


గంభీరావుపేట-లింగన్నపేట మధ్య మానేరు వాగుపై అర్ధాంతరంగా ఆగిపోయిన హైలెవల్ బ్రిడ్జి పనులు

గంభీరావుపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట-లింగన్నపేట మానేరు వాగు మధ్య నిర్మించ తలపెట్టిన హైలెవల్ బ్రిడ్జి పనులు ముందుకు సాగడం లేదు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం మొదలై ఏడాది దాటినా పనులు పూర్తి కాలేదు. పనులు తరుచూ ఆగిపోతుండటానికి కారణాలు ఏమై ఉంటాయో ఎవరికీ అంతు పట్టడం లేదు. గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై అంతకు ముందు ఉన్న లోలెవల్ వంతెన ప్రతి వర్షాకాలంలో ఎగువ మానేరు మత్తడి దూకి నీట మునిగి పోయేది. సిద్దిపేట-కామారెడ్డి జిల్లా మధ్య ఇదే ప్రధాన రహదారి కావడంతో పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. ఈ మార్గం వెంట వాహనాల రాకపోకలు నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బంది పడేవారు. వరద నీటి ఉధృతి తగ్గిన తరువాత తిరిగి వాహనాల రాకపోకలు కొనసాగేవి. ప్రతి ఏటా వర్షాకాలంలో ఈ సమస్య పరిపాటిగా మారేది. శాశ్వత పరిష్కారం కోసం హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు, నాయకులు పాలకులకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 17 కోట్లు మంజూరు అయ్యాయి. బ్రిడ్జి నిర్మాణ పనులను గత ఏడాది సెప్టెంబరులో శంకుస్థాపన చేశారు.

● పాత వంతెన కూల్చివేత..

పనుల్లో భాగంగా సదరు కాంట్రాక్టర్ పాత లోలెవల్ వంతెనను కూల్చివేసి వాహనాల రాకపోకలకు పక్కనే తాత్కాలిక మట్టి రోడ్డును వేశారు. గత వర్షాకాలంలో తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. ఇటు కొత్త బ్రిడ్జి నిర్మాణం జరగక, అటు తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయి ఈ మార్గం గుండా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాత వంతెన కూల్చకుంటే ఆ వంతెన నుంచే వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండేది. కానీ కాంట్రాక్టర్ ముందు చూపులేక ఉన్న పాత వంతెనను కూల్చడం ఏమిటని ప్రజలు ఆందోళనలు కూడా చేపట్టారు. ఈ పరిస్థితిని ప్రజలు కాంగ్రెస్ నాయకులకు విన్నవించడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి తాత్కాలిక మట్టి రోడ్డును వేయించారు. హైలెవల్ బ్రిడ్జి పనులు పిల్లర్ల స్థాయిలోనే ఉండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోవటానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా లేక అధికారుల అలసత్వమా ఇంకేదైనా కారణమా తెలియాల్సి ఉంది.

పనులు మొదలు పెట్టకుంటే నిరాహార దీక్షలు

గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన హైలెవల్ బ్రిడ్జి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ప్రాంత ప్రజలకు బ్రిడ్జి నిర్మాణం ఎంత ముఖ్యమో పాలకులకు చాలాసార్లు విన్నవించాం. స్థానిక ఎమ్మెల్యేకు, కేంద్రమంత్రికి స్వయంగా కలిసి వినతి పత్రాలను అందించాం. కాంగ్రెస్ నాయకులకు సైతం బ్రిడ్జి ప్రాముఖ్యాన్ని వివరించాం. బ్రిడ్జి పనులను ప్రారంభించాలి. లేకుంటే నిరాహార దీక్షలు చేపడతాం.

- పార్థసారథి శర్మ, గంభీరావుపేట

కాట్నపల్లిలో బంగారు నగల అపహరణ

చొప్పదండి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి గ్రామంలో బుధవారం చోరీ జరిగింది. తొమ్మిదిన్నర తులాల బంగారు నగలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఎస్ఐ అనూష కథనం మేరకు.. గ్రామానికి చెందిన గన్ను వెంకటరెడ్డి, అతని భార్య గన్ను రాణి ఊరిలోనే రైస్ మిల్లు నడుపుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం మంచిర్యాలలో తమ బంధువుల పెళ్లికి వెళ్లడానికి ఉదయం గన్ను రాణి బంగారు నగలను బీరువా నుంచి తీసి తన హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టి ఇంటి ముందు బల్లపై పెట్టింది. ఇంటికి సమీపంలో ఉన్న రైస్ మిల్లు దగ్గరికి వెళ్లి తన భర్తకు టిఫిన్ ఇచ్చి ఇంటికి రాగా బల్లపై ఉన్న హ్యాండ్‌బాగ్‌లో నగలు కనిపించలేదు. తొమ్మిదిన్నర తులాల నాలుగు బంగారు గాజులు, ఒక చంద్రహారం పోగా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం


చేతికందే ఎత్తులో స్తంబానికి ఉన్న ధ్వంసమైన డబ్బా

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీ సమీపంలోని విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ఫీజ్ బాక్స్ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. మరోవైపు విద్యుత్ వైర్లు స్తంభం చుట్టూ ఉండటంతో అదమరిచి ఉంటే విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిత్యం ఆ రహదారి గుండా విద్యార్థులు రాక పోకలు సాగిస్తారు. గ్రామ ప్రజలు కూడా ఇక్కడ ఎక్కువగా ఉంటారు. చేయి పడితే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, వెంటనే కొత్త బాక్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లను సరిచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భూ వివాదం కేసులో ఒకరి రిమాండ్

గంభీరావుపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భూవివాదం కేసులో మల్లా రెడ్డిపేటకు చెందిన చందును బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన రాజవ్వ 2022లో తన భూమికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు చందును ఏ7 ముద్దాయిగా చేర్చారు. కేసు పెండింగ్‌లో ఉన్నప్పుడు చందు దుబాయ్ వెళ్లాడు. దీంతో చందుపై లుకౌట్ నోటీసు జారీ చేశారు. దుబాయ్ నుంచి తిరిగి వచ్చే క్రమంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారు. పాస్‌పోర్టును కోర్టులో జప్తు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

అవయవాలపై జీడిగింజ రసం

● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

ధర్మపురి, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి) ధర్మపురి పట్టణానికి చెంది న ఖాజా ముషిక్ అనే వ్యక్తిపై అతడి భార్య ఖాజా అసియా, ఆమె తమ్ముడు ఎండి అలీ, అలీ అంజత్ కలిసి జీడిగింజ దంచి ముఖం, అవయవాలపై పూసారని ఖాజా ముషిక్ ధర్మపురి పోలీసులకు బుధ వారం ఫిర్యాదు చేశాడు. ఈ నెల 16న కమలాపూర్ చౌరస్తా వద్ద ఉన్న ఖాజా ముషిక్‌ను, అతడి బావమరిదితో పాటు మరో వ్యక్తి వచ్చి తన భార్య తీసుకు రమ్మన్నదని తీసుకెళ్లారు. కొద్ది రోజులుగా ఏ పని చేయకుండా మద్యం తాగుతూ ఖాళీగా తిరుగుతూ పరువు తీస్తున్నావంటూ తన పై జీడి పూశారని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పెర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై తెలిపారు.

మహిమాన్వితం మల్లన్న పట్నం

● గ్రామాల్లో వైభవంగా మల్లన్న దేవునికి పూజలు

సైదాపూర్, డిసెంబరు 25(ఆంధ్ర జ్యోతి): మల్లన్న దేవుని పట్నాలు వైభ వంగా సాగుతున్నాయి. ప్రతి సంవ త్సరం డిసెంబర్ 15 నుంచి మొదలు కొని సంక్రాంతి వరకు ఆ తరువాత ఫిబ్రవరి నుంచి ఉగాది వరకు గొళ్ల కురుమలతో పాటు మల్లన్న దేవుని కొలిచే వారు తమ ఇంటిలో పట్నాలు వేసుకుంటారు.

ఐదు సంవత్సరాలకు ఒక్కసారి పట్నాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇలా ప్రతి సంవత్సరం ఆది, బుధవారాలలో పట్నాలు నిర్వహి స్తారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తారు. మూడు రోజు ల పాటు పట్నాలు నిర్వహించి మల్లన్నను కొలుస్తారు. గొళ్ల కురుమలకు తమ ఇంటిలో పూజ గదిలో మల్లన్న గద్దె తప్పని సరిగా ఉంటుంది. గొళ్ల కురుమలే కాకుండా అన్ని కులాల వారు మల్లన్న గద్దె వేసుకొని పట్నాలు నిర్వహిస్తున్నారు. మల్లన్న దేవుడిని కొలిచి పట్నాలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీర్చడంతో పాటు కొం గు బంగారంగా నిలుస్తాడని

● పూజా విధానం

ముందుగా పోచమ్మతల్లికి పూజలు నిర్వహించిన అనంతరం అన్ని దేవత లకు పూజలు చేస్తారు. అనంతరం శిసత్తుల పూనకాలు, ఒగ్గు పూజారుల చప్పుడు, ప్రార్థనలతో ఊరి బయట పుట్ట వద్దకు వెళ్లి పుట్ట బంగారం (పుట్టమట్టి) తీసుక వస్తారు. ఆ పుట్ట మట్టితో మల్లన్న గద్దె వేస్తారు. బియ్యం తో మైలపోలు పోసి అందులో మల్లన్న దేవుని ప్రతిమలను (మల్లన్న దేవుని విగ్రహాలు) ఉంచుతారు. అనంతరం ఐదు రంగులతో అందంగా పట్నం వేస్తారు. దానిపై మల్లన్న దేవుడి ప్రతి మలు ఉంచి మల్లన్న దేవునికి, గొళ్ల కేతమ్మ, బల్య మ్యాడలమ్మకు వివా హం జరిపిస్తారు. బెల్లంతో అన్నం వం డి నైవేద్యాలు పెడుతారు. ఒక రోజు మొత్తం మల్లన్న చరిత్రను కథ రూపంలో ఒగ్గు పూజారులు వివరిస్తారు. తద నంతరం ఆ ఇంటి వారికి పట్నాలకు వచ్చిన వారికి ఆకులలో పాలు పోసి తాగిపిస్తారు. దీనిని శంకు తీర్థం అంటారు. దీనితో పట్నాలు ముగుస్తాయి.


సైదాపూర్ మండలం గుజ్జులపల్లిలో పట్నంపై ఉంచిన మల్లన్న దేవుని ప్రతిమలు

చాలా మంది నమ్ముతుంటారు. మల్లన్న పట్నాలలో గద్దె పట్నం, పెద్ద పట్నం అనే రెండు రకాలు ఉంటాయి.

శ్రీరాంసాగర్ నీటి విడుదల

జగిత్యాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి సీజన్ కొరకు కాకతీయ కాలువ ద్వారా అధికారులు, నాయకులు బుధవారం నీటి విడుదల ప్రారంభించారు. సీడ్స్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి కాలువకు పూల సమర్పణ చేసి నీటి విడుదల చేశారు. లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 300 క్యూసెక్కులను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కొద్దికొద్దిగా సాయంత్రం వరకు కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కుల వరకు పెంచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్‌పీ సీఈ శ్రీనివాస్‌రావు గుప్త, ఈఈ చక్రపాణి, డీఈఈలు రఘుపతి, గణేష్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

'కటుకోజ్వల'కు పురస్కారం



అంపశయ్య నవీన్ నవలా పురస్కారం అందుకుంటున్న మనోహరాచారి

కోరుట్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కవి, కథా రచయిత, తెలుగు ఉపాధ్యాయుడు కటుకోజ్వల మనోహరాచారి రాసిన 'అనామకుడు' నవల వరంగల్‌కు చెందిన అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు నవలా పురస్కారానికి ఎంపికైంది. విఖ్యాత రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో రచయిత కటుకోజ్వల మనోహరాచారికి అవార్డును అందించారు. నగదు బహుమతితో పాటు ప్రశంశాపత్రం, జ్ఞాపికతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో నవీన్‌తో పాటు ప్రముఖ సాహితీవేత్త గిరిజా మనోహర్ బాబు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ మిట్టపల్లి రాజేశ్వర్, కార్యదర్శి శ్రీమతి స్వప్న, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా వన్యప్రాణుల వేట

- ప్రమాదకరంగా విద్యుత్ తీగల ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు



వేట కోసం అమర్చిన విద్యుత్ తీగ(ఫైల్)

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో వన్యప్రాణుల వేట విచ్చలవిడిగా సాగుతోంది. వ్యవసాయ భూమలకు కంచెలా సన్నటి వైర్ చుట్టి దానికి విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. ఆ వైర్లను తాకిన వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇదే సమయంలో అటుగా వెళ్లిన ప్రజలు వైర్లను గమనించక వాటిని తాకి మృత్యువాత పడుతున్నారు. ఇలా వేట కోసం వచ్చిన వ్యక్తే విద్యుత్ తీగలు తగిలి మృతి చెందగా ఆయన వెంట వచ్చిన మరో వ్యక్తి కేసు భయంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలో కలకలం రేపింది. ఈ ప్రాంతంలో అడవి పందులు అధికంగా ఉన్నాయని, వాటిని చంపాలని ఓ ముగ్గురు రైతులు వేటగాళ్లను ప్రోత్సహించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇంత జరిగినా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అటవీ ప్రాంతంలో నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపే రావడం లేదని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మీల్స్ ఆన్ వీల్స్



ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న రావికంటి భాగ్యలక్ష్మి, కృష్ణకిశోర్

- కరీంనగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో అన్నదానం
- ప్రతి రోజు 200 మందికి ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం
- రోగులు, బంధువుల ఆకలి తీర్చుతున్న 'లయన్స్'
- నిరంతరం కొనసాగించేందుకు సంస్థ నిర్ణయం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మానవ సేవే. మాధవ సేవ.. ఆకలితో ఉన్నవారికి కడుపునిండా అన్నం పెట్టడం కంటే మించిన సేవ మరోటి లేదు.. అనుకున్నారు వారు. ఆ వెంటనే ఎక్కడ నిత్యం అన్నదానం చేస్తే మంచిదని ఆలోచిం చారు. జిల్లా ఆసుపత్రికి కరీంనగర్, ఆదిలాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు, వారి సహాయకులుగా వెంటవచ్చే వారికి, రోగులను చూసేందుకు వచ్చిన వారి కడుపు నింపాలని భావించారు. వెంటనే కార్యాచరణ రూపొందించుకొని నిత్యాన్న ప్రసాద వితరణ ప్రారంభించారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జీ సభ్యుల ఆధ్వర్యంలో 2023 జూలై 1న "మీల్స్ ఆన్ వీల్స్" అనే పేరిట అన్న వితరణకు శ్రీకారం చుట్టారు.

పుట్టిన రోజు, పెళ్లి రోజులను పురస్కరించుకుని..

లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జీకి ఆనాడు గవర్నర్‌గా ఉన్న అనుమాండ్ల రాజిరెడ్డి ప్రస్తుతం మీల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కో ఆర్డినేటర్‌గా ఉన్న రావికంటి కృష్ణకిషోర్ సంస్థలోని కొందరు సభ్యులతో కలిసి కరోనా సమయంలో ఆసుపత్రి వద్ద ప్రతిరోజు ఆకలితో ఉన్న వారికి ఉచితంగా అన్నం సమకూర్చాలని నిర్ణయించుకున్నారు. ఈ సంస్థలో 3,600మంది సభ్యులుగా ఉన్నారు. సంవత్సరం పొడవునా ప్రతిరోజు సభ్యుల్లో కొందరి పుట్టినరోజు, పెళ్లిరోజు, వారి కుటుంబ సభ్యుల శుభ కార్యక్రమాలు ఉంటాయి. ఆరోజు వారి పేరిట ఈ అన్నదానం కొనసాగిస్తే నిరంతరంగా దీన్ని నిర్వహించ వచ్చని భావిం చారు. పుట్టిన రోజు, పెళ్లి రోజున హోటళ్లకు వెళ్లి వేలకు వేలు ఖర్చుచేసే కంటే ఇక్కడ ఆకలితో ఉన్నవారి కడుపు నింపితే అంతకు మించిన తృప్తి లభిస్తుందని భావిం చారు. అదే విషయాన్ని సభ్యులకు తెలిపారు. మీల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కో ఆర్డినేటర్‌గా ఉన్న రావికంటి కృష్ణకిషోర్ ఏ రోజు ఎవరి పుట్టిన రోజో, పెళ్లి రోజు ఉందో ముందే కంప్యూటర్‌లో నమోదై ఉన్నం దున వారిని సంప్రదించి ఎవరో ఒకరితో ఈ అన్నదా నానికి అయ్యే ఖర్చును భరిం చేలా ఒప్పిస్తారు. ఎవరు ముందుకు రానిరోజు సంస్థే ఆ ఖర్చును భరి స్తుంది. కొన్ని రోజుల్లో ఇద్దరు లేక ముగ్గురు వ్యక్తులు కూడా ముందుకు వచ్చే సందర్భాలు ఉన్నపుడు ముగ్గురు పేరిట ఆరోజు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మిగిలిన డబ్బును ఇతరులు ముందుకురాని రోజు ఖర్చులకింద గానీ, ప్రతినెలా మీల్స్ ఆన్ వీల్స్ వాహనాన్ని నడిపే డ్రైవర్ జీతం, డీజిల్ ఖర్చు, ప్లేట్లు, ఇతర ఖర్చులకు అయ్యే సుమారు 30వేల రూపాయలను భరించేందుకు వినియోగిస్తారు.

544 రోజులుగా కొనసాగుతున్న సేవలు

ఈ కార్యక్రమాన్ని 544 రోజులుగా నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు ఆసుపత్రి ఆవరణలో 200 మందికి ఇడ్లీ, వడ టిఫిన్‌గా అందిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు భోజనం అందిస్తారు. టిఫిన్ అందజేయాలనుకున్న వారు రోజుకు రెండు వేలు, భోజనం సమకూర్చేవారు మూడు వేల రూపాయలు సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ డబ్బుతో 200మందికి ఉదయం అల్పాహారం, మధ్యా హ్నం భోజనం సమకూరుస్తున్నారు. అప్పటి గవర్నర్ అను మాండ్ల రాజిరెడ్డి ప్రారంభించిన కార్యక్రమాన్ని ప్రస్తుత గవర్నర్ ఎన్ వెంకటేశ్వర్లు కొనసాగిస్తున్నారు.

ఆకలి తీర్చితే పొందే ఆనందానికి వెలకట్టలేము...



ఎవరి వద్దనైనా ఎంత డబ్బు అయినా ఉండ వచ్చు. కానీ ఆకలికి అన్నం దొరకనప్పుడు డబ్బు ఉండి కూడా ఉపయోగం ఉండదు. ఆకలితో ఉన్న వారి కడుపు నింపడం ద్వారా మేము పొందు తున్న ఆనందానికి వెలకట్టలేము.. 544 రోజులుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాము. నిరంతరం దీనిని కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నాము. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం తయారు చేయించి వాహనంలో ఆసుపత్రికి పంపిస్తాము. అక్కడ దానిని అందరికీ పంపిణీ చేయడానికి రోజులో ఆరుగంటల వరకు వెచ్చించాల్సి వస్తుంది. అయినా దానిని స్వంత కార్యక్రమంగా తీసుకొని పనిచేస్తున్నాం.. ప్లాస్టిక్ ప్లేట్లను వినియోగించవద్దని ఆసుపత్రి వర్గాలు సూచించిన మేరకు స్టీల్ ప్లేట్లు అందుబాటులోకి తెచ్చి వాటిని భోజనం తినేవారికి ఇస్తున్నారు. కొందరు ఈ ప్లేట్లను వినియోగించుకునేందుకు ఆసక్తి చూపిం చనందువల్ల ఆకు ప్లేట్లను తెప్పించాలను కుంటున్నాం.

- చీఫ్ కో ఆర్డినేటర్ రావికంటి కృష్ణకిశోర్

ఎల్ఎల్‌బీ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న ఎల్ఎల్‌బీ ఐదో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్‌వి శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. పరీక్షలు జనవరి 6న ప్రారంభమై 20వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

రాయపట్నం రహదారికి మరమ్మతులు చేపట్టండి

చొప్పదండి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయపట్నం రహదారిపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కొలిమికుంట, చొప్పదండిలో రహదారిని పరిశీలించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో మరమ్మతు పనులు పూర్తిచేసి రహదారిని బాగు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నిజానపురం చందు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పురం రాజేశం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, జిల్లా కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్య, కౌన్సిలర్ కొట్టె అశోక్, నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, ముద్దం తిరుపతి, మునిగాల చందు, గుర్రం రమేష్‌గౌడ్, తోడేటి డేవిడ్, రాజేందర్ రెడ్డి, మావురపు రాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యూటేషన్ ఆలోచన విరమించుకోవాలి

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): సమ్మె చేస్తున్న కెజీబీవీ ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు విరమించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు తిరుకోవెల శ్యాం సుందర్, కార్యదర్శి అంబటి భూమేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదిహేడు రోజులుగా సమ్మెచేస్తున్న కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప జేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యంత శ్రమ దోపిడీకి గరవుతున్నది ఉద్యోగులేన్నారు. చేస్తున్న పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. వారి న్యాయమైన సమస్యల ప్రభుత్వం వెంటనే పరిష్కరించి విద్యార్థులకు నష్టం జరుగకుండా చూడాలని కోరారు.

వేములవాడ ఆయలంలో రద్దీ

వరుస సెలవులతో తరలివచ్చిన భక్తులు



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. బుధవారం సెలవు రోజు కావడంతో భక్తులు రాజన్న ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా భక్తులు తరలిరావడంతో రద్దీ పెరిగింది. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు గంటన్నర సమయంపట్టినట్లు భక్తులు తెలిపారు. ఏఈవోలు అశోక్, శ్రావణ్, సూపరింటెండెంట్‌లు తిరుపతిరావు, నరేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు.

మల్లన్న జాతరకు పోటెత్తిన భక్తులు



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. ఉత్సవాల్లో భాగంగా మూడవ బుధవారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని, స్వామివారికి ప్రీతిపాత్రమైన బంతిపూలు మెడలో ధరించి ఒగ్గు పూజారుల ఢమరుకనాదాల నడమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తమ చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీయంచగా, మరి కొందరు నిలువెత్తు నల్ల బంగారం (బెల్లం) తులాభారం వేసి భక్తులకు పంచిపెట్టారు. మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘు వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టికెట్ల ద్వారా ఆలయానికి రూ. 40,680 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు సిద్ధంకి నర్సయ్య, గోస్కుల రాజన్న, బేర కిషోర్, భీమ సత్తయ్య, నాయకులు సిద్ధంకి మల్లయ్య పాల్గొన్నారు.

● జాతరలో తల్లిదండ్రులతో కలిసి వచ్చిన జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన గుర్రం సాయి కృతిక్ అనే ఐదేళ్ల బాలుడు జాతరలో తప్పిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్సై చిర్ర సతీష్ కుమార్ బాలుడిని వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. సిబ్బందికి బాలుడి తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వేంపేటలో శతచండీ మహా సుదర్శన ఉత్సవాలు



ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకెళ్తున్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శతచండీ మహాసుదర్శన నారసింహ యాగ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలను చేపట్టగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీచక్రపాణి వామనాచార్యులు వేదమంత్రోత్స వాల మధ్య నగర సంకీర్తన, గ్రామ ప్రదక్షణ, ఆలయ ప్రవేశం, యజ్ఞఆరంభసూచన, ధ్వ జారోహణము, గోపూజ పుణ్యాహవచనము, అంకురారోపణము వంటి కార్యక్రమాలను భక్తులచే జరిపించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ, గామాభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు, మహిళలు, భక్తులు, పాల్గొన్నారు.

యథేచ్ఛగా అటవీ భూముల ఆక్రమణ

- సాగు పేర చెట్లను నరుకుతున్నా చర్యలు శూన్యం
- చోద్యం చూస్తున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు, 25 (ఆంధ్రజ్యోతి) : అటవీ భూమి కనబడితే చాలు ఆక్రమదారులు కబ్జాలు, విక్రయాలు చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. భవిష్యత్తు తరాలకు అడవులను మిగిల్చకుండా భూ ఆక్రమణదారులు అడవులను యథేచ్ఛగా కబ్జాలు చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో విలువైన అటవీ ప్రాంతం కనుమరుగువుతోంది. గత ప్రభుత్వ హయాంలో కోట్లరూపాయలు ఖర్చుచేసి మొక్కలు నాటించినప్పటికీ ఆక్రమదారులు చెట్లు నరికి సాగు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు న్నాయి. మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్, ఆత్మనగర్, రంగరావుపేట, రామల చ్చక్కపేట, సత్తక్కపల్లి, రాజేశ్వర్‌రావుపేట, మెట్లచిట్టాపూర్, పాటిమీదితండా, కేసీఆర్‌తండా, అల్లూరిసీతా రామరాజుతండా గ్రామాలతో పాటు పలు గ్రామశివారులో అటవీ భూములు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కొందరు సాగు పేరిట అటవీ భూములను కొల్లగొడుతున్నారు. గతంలో ఈ విషయాన్ని పలువురు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నియంత్రించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు.



ఆత్మకూర్ గ్రామ శివారులోని అటవీ భూమిలో ఆందళోన చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

యథేచ్ఛగా అటవీ భూముల విక్రయాలు..

మండలంలోని రంగరావుపేట, కేసీఆర్ తండా గ్రామాల మధ్య ఉన్న అటవీ భూముల క్రయవిక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఎకరాల కొద్ది చదును చేసి హద్దులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ భూమిని తమదిగా ఆధీనంలోకి తెచ్చుకుని గ్రామంలో ప్రచారం చేసుకుంటున్నారు. తరువాత గిరిజనలకు పట్టలు అవుతాయని తెలుపుతూ ఎకరానికి రెండు నుంచి మూడు లక్షల రూపాయలతో విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని రంగారావుపేట, ఆత్మకూర్ గ్రామాల్లో ఎక్కువగా అటవీ భూములు న్నాయి. గత ప్రభుత్వం హయాంలో పోడు భూములకు హక్కులు కల్పిస్తామని ప్రకటించడంతో కొందరు అక్రమాలకు పాల్పడ్డారు. అటవీ భూములను రాత్రి సమయంలో చదు ను చేసుకున్నారు. వారిని చూసి మరికొంత మంది రైతులు కూడా భూములను చదును చేసుకున్నారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు కబ్జాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో భూమి చదును చేయడం నిలిపి వేశారు. కొంత కాలం తరువాత చదును చేసిన భూముల్లో పంటలను సాగు చేసుకుంటున్నారు. ఇటీవల ఆత్మకూర్ గ్రామ పరిధిలో గండిమీది గుట్టల ప్రాంతంలో వందల ఎకరాల అటవీ భూమి కబ్జాకు పాల్పడు తున్నరనే విషయాన్ని గ్రామస్థులు సంబం ధిత అధికారికి తెలిపిన పట్టించు కోలేదని వారు ఆరోపిస్తున్నారు.



ఆత్మకూర్‌లో కబ్జా చేసిన అటవీ భూమి

ఫారెస్ట్ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు

అటవీ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆత్మకూర్‌లో కబ్జాకు పాల్పడినట్లు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. రేంజర్ సెలవుల్లో ఉన్నందును ఇన్‌చార్జి అధికారి దృష్టికి తీసుకెళ్లి కబ్జా చేసిన భూమిని కలిసి పరిశీలిస్తాం. అటవీ భూమిని ఆక్రమించినట్లయితే వారి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

- ఆసిఫ్ సత్తర్, ఫారెస్ట్ బీట్ అధికారి

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



తృతీయ స్థానం సాధించిన కరీంనగర్ జిల్లా మహిళల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానం సాధించింది. హైదరాబాద్ జిల్లా హాకీంపేటలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా బాలికల జట్టు సెమీ ఫైనల్‌లో పాల్గొని తృతీయ స్థానం సాధించింది. బుధవారం రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశం, కార్యదర్శి మహేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ట్రోఫీలను ప్రదానం చేశారు. జిల్లా బాలికల జట్టును జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అమిత్‌కుమార్, మల్లేశ్‌గౌడ్, వైస్ చైర్మన్ అనూకర్‌రావు, నిర్వహణ కార్యదర్శి సీహెచ్ సంపత్‌రావు, కోచ్ పద్మ తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జశ్వంత్, లక్ష్మిప్రసన్న, వివేక్

సిరిసిల్ల టౌన్ : సీఎం కప్ - 2024 రాష్ట్ర స్థాయి పోటీలకు సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని నాగుల బాగ్యరేఖ, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్కే మొహియొద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు. సీఎం కప్ - 2024 మండల, జిల్లా స్థాయి ఖోఖో, ఫుట్‌బాల్ పోటీలలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి కే జశ్వంత్, 8వ తరగతి విద్యార్థిని సీహెచ్ లక్ష్మి ప్రసన్న(ఖోఖో), 10 తరగతి విద్యార్థి వివేక్(ఫుట్‌బాల్)అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినట్లు చెప్పారు. వరంగల్‌లో ఈ నెల 29న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.

దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలు మరువలేనివి




ఖని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో, గోదావరిఖని చౌరస్తాలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో..

గోదావరిఖని, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): భారతరత్న మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరువలేనవని పలువురు వక్తలు కొనియాడారు. వాజ్‌పేయి శతజయంతి వేడుకలు బుధవారం జిల్లాలో ఘనంగా జరిగాయి. గోదావరిఖనిలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ పిడుగు కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి హాజరై వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాజ్‌పేయి దేశప్రధానిగా ఎన్నో సేవలందించారని, ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రగామిగా చేయడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు మేరుగు హన్మంత్‌గౌడ్, కోమళ్ళ మహేష్, ధర్మపురి, కొడూరి రమేష్, మిట్టపల్లి సతీష్, బాణాల స్వామి, భాస్కర్, అందె రాజ్‌కుమార్, మాదరబోయిన రాకేష్, వీరేశం, చిరంజీవి, బియ్యాల మహేందర్, అపర్ణ, సంపూర్ణ, విశ్వాస్, శ్యామ్‌పటేల్, బుంగ మహేష్ పాల్గొన్నారు.

కోల్‌సిటీ: గోదావరిఖని చౌరస్తాలో వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేరుగు హన్మంతుగౌడ్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతుగౌడ్ మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి సమర్థ సుపరిపాలన అందించారన్నారు. గ్రామాల్లో సడక్ యోజన కింద ప్రతీ గ్రామానికి రోడ్లు వేసిన ఘనత వాజ్‌పేయికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి రవీందర్, సుల్వ లక్ష్మీనర్సయ్య, మహవాది రామన్న, జక్కుల నరహరి, నవీన్, సోమారపు అరుణ్, మల్లేష్, మంజుల, శివ, రాజు, రమేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

రమేష్‌నగర్‌లో వాజయ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యురాలు మాతంగి రేణుక ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాజ్‌పేయి దేశంలో ఎన్నో ప్రజాసం క్షేమ కార్యక్రమాలు చేపట్టారని, కమ్యునికేషన్ వ్యవస్థను పటిష్ట పరిచారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మామిడి రాజేష్, కొమ్ము శ్రీనివాస్, మామిడి సంపత్, మంద శ్రీనివాస్, లక్ష్మి, మల్లక్క, ఉమ, శ్రీహరి, సత్యనారాయణ, సదానందం పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మండలంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు జెట్టి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు వడ్లకొండ మహేష్, గున్నాల ప్రవీణ్, కల్లెపల్లి హరీష్, రాజు, లింగయ్య, అశోక్ తదితరులు గర్రెపల్లి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతు వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ ప్రధానిగా వాజ్‌పాయి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు కంకణాల జ్యోతిబసు, సంకెండ్ల నర్సయ్య, వడ్లకొండ సంపత్, కొక్కుల బద్రయ్య, శేఖర్, చిన్నయ్య, శ్రీనివాస్, రాము, రాజు పాల్గొన్నారు.

తెరపైకి గుంజపడుగు మండలం

(5వ పేజీ తరువాయి)

ఉండాలనే నిబంధనను అనుసరించి రూపకల్పన చేస్తున్నారు. అలాగే సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ శాఖ దీనికి సంబంధించిన మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నది. రెండు, మూడు రోజుల్లో దీనికి సంబంధించిన నివేదికను జిల్లా అధికారులు ప్రభుత్వానికి సమర్పించనున్నారు.



గర్రెపల్లి మండలం ఏర్పాటు చేయాలని నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

● **కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు..**

జిల్లాలో మరో 12 గ్రామాలను గ్రామ పంచాయతీలు గా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను పంచాయతీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని మంథని మండలంలో శాస్త్రులపల్లి, స్వర్ణపల్లి, ముత్తారం మండలం కాసర్లపల్లి, రంగయ్యపల్లె, సర్వారం, కాజీపల్లి, శుక్రవారంపేట, రామగిరి మండలం వకీల్‌పల్లి, గడ్డంపల్లి, కమాన్‌పూర్ మండలం కిష్టంపల్లి, ముల్కలపల్లి, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని లబాడితండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీనికి సంబంధించిన నివేదికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 267 గ్రామపంచాయతీలు ఉండగా, నెలరోజుల క్రితం మంథని మండలం తోట గోపయ్యపల్లి, ముత్తారం మండలం జిల్లెల్లపల్లి పంచాయతీలుగా ఏర్పాటు కావడంతో 269కి పెరిగాయి. తాజాగా ప్రతిపాదించిన 12 పంచాయతీలు ఏర్పాటైతే పంచాయతీల సంఖ్య 281కి చేరుకోనున్నది.

ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి



క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు బుధవారం వారు సంఘీభావం తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శిబిరం వద్ద వేడుకలు ఏర్పాటు చేయగా మాజీ మంత్రి కేక్‌కట్ చేశారు. అనంతరం కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్ఎస్‌ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. వెంటనే వారి న్యాయమైనా డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. అలాగే మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి రఘునాథ్‌రావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు తిప్పని తిరుపతి, కుంభాల సుధాకర్, సంధ్యారాణి, రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన పత్రం అందజేత

కమాన్‌పూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓరుగంటి రాజమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల అంగీకరాంతో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం జరిగింది. నేత్రదానంతో ఇద్దరు అంధులకు కళ్లు రానుండగా ఆమె సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నేత్రదాత కూతురు జంగంపల్లి లక్ష్మి, కుటుంబసభ్యులకు కమాన్‌పూర్ లయన్స్‌క్లబ్ కార్యదర్శి నల్లవెల్లి శంకర్, ఛత్రపతి శివాజి యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగంపల్లి శ్రీనివాస్ అభినందన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, గౌరవ సలహాదారు నూక రమేష్ పాల్గొన్నారు.

విలీన సభను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజన్న పిలుపునిచ్చారు. బుధవారం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఫైలాన్ చౌరస్తా వద్ద పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు న్యూడెమోక్రసీ పార్టీలు ఈనెల 28న విలీనం చేస్తున్న సందర్భంగా కార్యక్రమానికి జాతీయ అధికార ప్రతినిధి దర్శన్‌సింగ్ కట్కూర్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఐ కృష్ణ, ఈదునూరి నరేష్, వెంకన్న, శంకర్, చంద్రయ్య, మల్లేష్, రవికుమార్ పాల్గొన్నారు.

దున్నకుండా సాగు.. దిగుబడి బాగు..

మండలంలోని 22గ్రామాల్లోని 15వేల ఎకరాల్లో జీరో టిల్లేజ పద్ధతితో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. మండల వ్యాప్తంగా రైతులు జీరో టిల్లేజ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో ఆరుతడి పంటల సాగును ఇంత పెద్ద మొత్తంలో చేయడం గత 15 ఏళ్లలో ఇదే మొదటిది.



గుంపుల శివారులో జీరో టిల్లేజ పద్ధతిలో సాగుచేసిన మొక్కజొన్న

- మండలంలో జీరో టిల్లేజపై పెరిగిన ఆసక్తి

- 15 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు

ఓదెల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో జీరో టిల్లేజి పద్ధతిపై రైతుల్లో ఆస్తి పెరిగింది. ఈ విధానంలో ఖరీఫ్ వరి పంట పూర్తికాగానే కొయ్యలను దున్నకుండా అందులోనే మొక్కజొన్న విత్తనాలు నాటుతారు. సాధారణంగా దుక్కులు దున్ని మొక్కజొన్న విత్తనాలు నాటడం పూర్తయ్యేసరికి అన్ని ఖర్చులు కలిపి రూ.20వేలుపైగా అవుతాయి. ఈ విధంగా ఆర్థిక నష్టాలను తప్పించుకునేందుకు జీరో టిల్లేజి వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. ఎక్కువ నీరు అవసరం లేకుండా పంట దిగుబడి అధికంగా వస్తుంది. ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ల మేరకు మొక్కజొన్న దిగుబడి వస్తుంది. అలాగే పంట సాగులో ఆలస్యం అయితే 25 నుంచి 30 క్వింటాళ్ల మేరకు దిగుబడి పడిపోతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

● **ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ..**

పదిహేనేళ్ల క్రితం సాగునీటి కొరతవల్ల వరి పంటలు వేయకుండా మొక్కజొన్న, కంది పంటలను సాగుచేశారు. క్రమంగా సాగునీటి సౌకర్యం లభించడంతో మళ్లీ రైతులు వరి పంట వైపు దృష్టి సారించారు. దీంతో భూముల స్వభావం వల్ల వరి ధాన్యం దిగుబడి పెరుగుతూ, తగ్గుతూ వస్తుండడంతో ప్రస్తుత వేసవి పసలకు రైతులు అధిక మొత్తంలో తక్కువ ఖర్చుతో జీరో ట్రిల్లెజ్ పద్ధతితో మొక్కజొన్న సాగును ఎన్నుకున్నారు.

● **జీరో టిల్లేజతో భూసారం పెరుగుతుంది..**

- భాస్కర్, ఏవో, ఓదెల



వరి పంటల కంటే జీరో టిల్లేజి విధానంలో మొక్కజొన్న సాగుతో భూసారం పెరుగుతుంది. ఇందులో యంత్రాల వాడకం ఉండదు. రసాయన మందుల వాడకం అతి తక్కువగా ఉంటుంది. ఖర్చు తక్కువ, ఎక్కువ లాభం. పంట మార్పిడితో భూములకు ప్రయోజనమే కాకుండా మొక్కజొన్నకు కీటకాల తాకిడి అతి తక్కువగా ఉంటుంది. దీంతో రైతులకు ఆర్థిక భారం తప్పుతుంది.

● **శ్రమ తక్కువ.. లాభం ఎక్కువ..**

- రాచర్ల రాజేశం, రైతు ఓదెల



అధిక ఖర్చులను తగ్గించుకోవడం, పంట దిగుబడిని పెంచడం కోసం జీలో టీల్లేజ పద్ధతిలో మొక్కజొన్న సాగుచేశాను. దీంతో శ్రమ తగ్గడమే కాకుండా లాభం ఎక్కువ ఉంటుంది. ఇంతకుముందు కూడా సాగు చేస్తే నష్టాలేమి లేవు. మొక్కజొన్న రైతుల కోసం మండలంలో రెండు మార్క్‌ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే కొంత భారం తగ్గుతుంది.

మండల స్థాయి వాలీబాల్ పోటీలు

అంతర్గాం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలం కేంద్రంలో బుధవాతం ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్గాం, పాలకుర్తి మండల స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంతర్గాం తహసీల్దార్ తూమ్ రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరకంగా, ఆరోగ్యంగా, మనశ్శాంతిగా ఉండాలంటే శరీరానికి వ్యాయామం చాలా అవసరమని వివరించారు. తప్పకుండా ప్రతీ ఒక్కరు క్రీడలకు ప్రాముఖ్యం ఇవ్వాలన్నారు. ఇలాంటి మంచి అలవాట్లకు ప్రాముఖ్యం ఇచ్చినప్పుడే మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. మత్తుపదార్థాలు,, దూమపానీ యాలు లాంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉంటారన్నారు. ప్రతి ఒక్క యువత చెడు అలవాట్లకు బానిస కావద్దని, క్రీడల్లో ముందుకు కొనసాగుతూ మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. అలాంటప్పుడే సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటామని వివరించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ రవీందర్

క్రీడాకారులకు ఎప్పుడు సహకరిస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అంగోత్ రవినాయక్, వైస్‌చైర్మన్ సాయి కిరణ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ప్రణీతగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంకం రవికుమార్, పీటీ వెంకట్రావు, నాయకులు మాడ నారాయణరెడ్డి, కోల సంతోష్ గౌడ్, యువకులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజం కోసం కృషి

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని టీబీ సీనియర్ చికిత్స పర్యవేక్షకులు దేవ తిరుపతి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని దేశంలోని 324 జిల్లాల్లో నిర్వహిస్తుందని ఇందులో భాగంగా పెద్దప ల్లి జిల్లాలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నిమ్మనపల్లి గ్రామంలో నిక్షయ్ శిబిర్ 100 రోజుల పథకంలో భాగంగా ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షయ శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎం ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ సుష్మిత, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం, అభిషేక్ పాల్గొన్నారు.



నిమ్మనపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

వకీల్‌పల్లె గనికి రోలింగ్ షీల్డ్



షీల్డ్‌లతో ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి) ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లె గని రెండు విభాగాల్లో రోలింగ్ షీల్డ్ బహుమతి దక్కించుకున్నది. సింగరేణి వ్యాప్తంగా భూగర్భ గనుల్లో ఎల్‌హెచ్‌డీ, కంటిన్యూస్ మైనర్ విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను వకీల్‌పల్లె గని బహుమతికి ఎంపికైంది. కాగా ఈ నెల 23న కొత్తగూడెంలో జరిగిన సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో గని అధికారులు సీఎండీ చేతుల మీదుగా రోలింగ్ షీల్డ్ అందుకున్నారు. బుధవారం ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య రోలింగ్ షీల్డ్‌ను తన ఛాంబర్‌లో గని అధికారులకు అందజేశారు. మెరుగైన ఫలితాలు సాధించి బహుమతి దక్కించుకున్న వీకేపీ గని ఉద్యోగులకు జీఎం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గని పీవో నెహ్రూ, గ్రూప్ ఇంజనీర్ చంద్రశేఖర్, గని మేనేజర్ రవికిరణ్, సర్వే అధికారి అఫ్సర్‌పాషా, డీవైపీఎం శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

ఏజీపీలను సన్మానించిన న్యాయవాదులు



ఏజీపీలను సన్మానిస్తున్న న్యాయవాదులు

కోల్‌సిటీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జిల్లా కోర్టు ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్) శంతన్‌కుమార్, మున్సిఫ్ కోర్టు ఏజీపీగా సౌజన్యను నియమించిన సందర్భంగా బుధవారం కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొప్పుల శంకర్ మాట్లాడుతూ ఏజీపీలుగా శంతన్‌కుమార్, సౌజన్య నియామకానికి కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, జవ్వాజి శ్రీనివాస్, న్యాయవాదులు పెండ్యాల మహేష్, మాదాసు శ్రీనివాస్, ముష్కె రవి, నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు




గోదావరిఖనిలో కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కాల్వశ్రీరాంపూర్‌లో కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

గోదావరిఖని, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖనిలోని గ్లోరియస్ చర్చి, కల్వరి చర్చిల్లో జరిగిన వేడుకల్లో రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాలి, దయ, క్షమాగుణం మానవాళికి బోధించిన మహనీయులు యేసుక్రీస్తు అన్నారు. తోటి వారిని ప్రేమించండి తోటి వారికి ఉపకారం చేయండి పది మందికి సహాయం చేసినపుడే జన్మ ధన్యమవుతుందని యేసుక్రీస్తు చెప్పారన్నారు. తనను శిలువ వేసిన వారిని, తనను నానా మాటలు అన్నవారిని కూడా క్షమించండి అన్న గొప్ప దయామయుడు ఏసుక్రీస్తు అని కొనియాడారు. దేశంలో క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా జరిపిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగకు హిందూవులు, రంజాన్ పండుగకు ముస్లింలు, క్రిస్మస్ పండుగకు క్రైస్తవులకు కేసీఆర్ కొత్త బట్టలను అందించారని తెలిపారు.కార్యక్రమంలో జిమ్మిబాబు, తదితరులు పాల్గొన్నారు.

● **కాల్వశ్రీరాంపూర్ మండలంలో..**

కాల్వశ్రీరాంపూర్: క్రిస్టియన్స్‌కు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఎల్లవేళల సహకారం అందిస్తూ తోడుంటారని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా మండలంలోని పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఎద్దులాపూర్ తదితర గ్రామాల్లో ప్రార్థన మందిరాలకు వెళ్లి క్రిస్టియన్స్‌తో క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ ందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సునీల్‌రావు, ఆరెల్లి రమేష్, క్రిస్టియన్స్ తదితరులు పాల్గొన్నారు.

● **ఎలిగేడులో..**

ఎలిగేడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసుక్రీస్తు విశ్వమానవాళికి మార్గదర్శకకంగా నిలిచాడని, శాంతి సహనం కరుణ ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు సూచించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ క్రైస్తవ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

● **ఓదెలలో..**

ఓదెల: మండలంలోని ఓదెలతో పాటు కనగర్తి, గుంపుల, మడక, పొత్కపల్లి, కొలనూర్, జీలకుంట తదితర గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు బైబిల్ పఠనం నిర్వహించి, క్రీస్తు జననాన్ని వివరించారు. అలాగే కేక్‌లను కట్ చేసి పంపిణీ చేశారు.

● **జూలపల్లిలో..**

జూలపల్లి: జూలపల్లి మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో క్రిస్‌మస్ పర్వదిన వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. వడుకాపూర్, కుమ్మరికుంట, పెద్దాపూర్, తెలుకుంట, ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు ఏసుక్రీస్తు తమ పిల్లాపాపలను కలకాలం చల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని చర్చీల పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

● **యైటింక్లయిన్‌కాలనీలో..**

యైటింక్లయిన్‌కాలనీ: క్రిస్మస్ పర్వదినాన్ని కాలనీలోని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం రాత్రికే చర్చిలకు చేరుకున్న క్రైస్తవులు తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అర్ధరాత్రి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక సీఎస్ఐ చర్చి, పెంతెకొస్తు, హెబ్రోన్ చర్చి, కల్వారి చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు. సీఎస్ఐ చర్చిలో పెద్దసంఖ్యలో క్రైస్తవులు క్రీస్తు గీతాలని ఆలపించారు. స్థానిక పాస్టర్ బ్యూలా వాట్సన్ కేక్‌కట్ చేశారు. అనంతరం యేసు జనన విశిష్టతను, బోధనలను వివరించారు. క్రిస్మస్ వేడుకల్లో చర్చి కమిటీ సభ్యులు పూర్ణాకర్, అబ్రహం, దేవసహాయం, దయాకర్, సామ్యూల్‌రాజ్, జ్యోతి, సుహాసిని, శిల్ప, సరిత, జాన్‌సుందర్ పాల్గొన్నారు.

వైకుంఠధామం ద్వారం తెరిచిన అధికారులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ప్రధాన ద్వారం తెరిచి పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పాలకుర్తి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జయ్యారం గ్రామంలోని వైకుంఠధామం ద్వారాలు పంచాయతీ అధికారులు తెరిచారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'అంతిమ సంస్కారాలకూ ఇబ్బందులే..' అనే కథనం బుధవారం ప్రచురితమైంది. వైకుంఠదామంలో వసతులు కరువయ్యాయని, ప్రధాన ద్వారం మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కథనం ప్రచురితం కావడంతో పంచాయతీ కార్యదర్శి స్పందించారు. సిబ్బందితో వైకుంఠధామం ప్రధాన ద్వారం తెరిపించడంతో పాటు అక్కడి పిచ్చి మొక్కలను పంచాయతీ పారిశుధ్య కార్మికులతో తొలగించారు. వైకుంఠధామాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిన 'ఆంధ్రజ్యోతి' పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గోదావరిఖని చౌరస్తాలో మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు అధ్యక్షుడు మాలెం మధు మాట్లాడుతూ అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల వెంకటి, బొమ్మక వెంకటేశ్వర్లు, సోగాల వెంకటి, రామస్వామి, రాజమల్లయ్య, నంది నగేష్, కుమార్, లింగస్వామి, దాసరి ఎల్లయ్య, రామరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.